క్లుప్తంగా

ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు


సబ్బవరం కేజీబీవీ విద్యార్థినులతో ఎమ్‌ఈవో - 2 సూర్యనారాయణమూర్తి

సబ్బవరం : మండలంలోని సబ్బవరం కేజీబీవీ పాఠశాలను మండల విద్యాశాఖాధికారి – 2 బోలెం సూర్యనారాయణ మూర్తి గురువారం సందర్శించారు. పాఠశాలలోని తరగతి గదులను పరిశీలించి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ప్రణాళికతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాలు పెడుతున్నారో..? లేదో..? అడిగి తెలుసుకున్నారు. పాఠశాల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. కేజీబీవీ ఇన్‌చార్జి ఎస్‌వో సుధారాణి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలలో ‘పొలం బడి’


కూరగాయ మొక్కలు నాటుతున్న విద్యార్థులు

సింహాచలం: జీవీఎంసీ 94వ వార్డు వేపగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గోపాలపట్నానికి చెందిన జేడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులతో వంగ, మిరప, టమాటా, కాలీ ఫ్లవర్, చిక్కుడు, తదితర కూరగాయల మొక్కలను నాటించారు. అనంతరం మొక్కల పెంపకంపై అవగాహన కల్పించారు. వాటి సంరక్షణ విద్యార్థులకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఉమామహేశ్వర రావు, ఉపాధ్యాయులు నిర్మలకుమారి, సుభాషిణి, జేడీ గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.

మందుబాబులకు రూ.49 వేలు జరిమానా

పీఎం పాలెం: మద్యం సేవించి ద్విచక్ర వాహనాలు నడిపిన వారిపై న్యాయస్థానం కొరడా ఝుళిపించింది. వెయ్యి రూపాయల నుంచి రూ.10 వేలు వరకూ జరిమానాలు విధించింది. ఇందుకు సంబంధించి పీఎం పాలెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ మురళీకృష్ణ గురువారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మద్యం సేవించి ద్విచక్ర వాహనం నడిపిన 13 మందిపై ఇటీవల కేసులు నమోదు చేసిన పోలీసులు గురువారం న్యాయస్థానంలో హాజరు పరిచారు. విచారించిన స్పెషల్ మేజిస్ట్రేట్ సెకండ్ క్లాస్ ఫర్ ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి నిందితులకు రూ.49 వేల జరిమానా విధించారు. మరో మారు మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు చిక్కితే జైలు శిక్ష తప్పదని ఎస్‌ఐ మురళీకృష్ణ హెచ్చరించారు.

110 లీటర్ల పెట్రోల్ స్వాధీనం


స్వాధీనం చేసుకున్న పెట్రోల్‌తో అధికారులు

పీఎం పాలెం: పీఎం పాలెం పరిసర ప్రాంతాల్లో అక్రమంగా పెట్రోల్, డీజిల్ విక్రయిస్తున్న వారిపై పౌర సరఫరాల శాఖ అధికారులు గురువారం కొరడా ఝుళిపించారు. కొన్నాళ్లుగా చిన్న చిన్న బడ్డీలు వద్ద అక్రమంగా పెట్రోల్, డీజిల్ విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. ఈ విషయం అధికారుల దృష్టికి రావడంతో డీఎస్‌వో ఆదేశాల మేరకు పీఎం పాలెం, లక్ష్మీవానిపాలెంలో పౌరసరఫరాల శాఖ అధికారులు దాడులు చేశారు. 110 లీటర్ల పెట్రోల్, 34 లీటర్ల డీజిల్ స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా విక్రయిస్తున్న పాన్ షాపు యజమానిపై కేసు నమోదు చేశారు. దాడుల్లో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, రమేష్, మురళి పాల్గొన్నారు.

అనధికారక దుకాణం సీజ్

ఏయూ క్యాంపస్: స్థానిక 20వ వార్డు పరిధిలో జీవీఎంసీ అరకు కాఫీ షాపు పక్కనే అనధికారకంగా ఏర్పాటు చేసిన దుకాణాన్ని గురువారం సీజ్ చేశారు. స్థానిక అపార్ట్‌మెంట్‌వాసులు ఫిర్యాదు చేయడంతో స్థానిక కార్పొరేటర్ ముప్పల లక్ష్మి, ఏసీపీ శాస్త్రి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ప్రకాష్ స్వయంగా పరిశీలించారు. అపరిశుభ్ర వాతావరణంలో దుకాణాన్ని నిర్వహిస్తుండడాన్ని గమనించి, మూసి వేయాలని నిర్ణయించారు. ఈ మేరకు దుకాణానికి తాళం వేశారు.

అంతటా శ్రావణ శోభ

- పూజా సామగ్రి కొనుగోలుదారులతో కిటకిటలాడిన మార్కెట్లు
- రెండో శుక్రవారం పూజలకు ముస్తాబైన ఆలయాలు


అడవివరంలో పూజా సామగ్రి, పళ్లు కొనుగోలు చేస్తున్న మహిళలు

సింహాచలం: మార్కెట్లు శ్రావణ శుక్రవారం శోభతో కళకళలాడాయి. శ్రావణ శుక్రవారం, వరలక్ష్మీ వ్రతం పురస్కరించుకుని గురువారం అడవివరం, ప్రహ్లాదపురం మార్కెట్లు పూజా సామగ్రి కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. అడవివరంలోని వారాంతపు సంత కిక్కిరిసింది. మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి వరలక్ష్మీవ్రతానికి కావల్సిన పూజా సామగ్రిని కొనుగోలు చేశారు. పండ్లు, పువ్వుల షాపులు మహిళలతో రద్దీగా మారాయి. మధ్యాహ్నం 3 గంటల నుంచి గంట పాటు భారీ వర్షం పడడంతో విక్రయాలు తగ్గాయి. ఆ తర్వాత వర్షం తెరిపివ్వడంతో మార్కెట్‌కు కొనుగోలుదారులు పెద్ద ఎత్తున చేరుకున్నారు. ఈ ఏడాది ధరలు అధికంగా ఉండడంతో కొనుగోలుదారులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

- పెందుర్తి మండలం వేపగుంట, చినముషిడివాడ, పెందుర్తి రైతుబజార్, జంక్షన్లలో ఉన్న మార్కెట్లు పూజా సామగ్రి కొనుగోలు కోసం వచ్చిన మహిళలతో రద్దీగా కనిపించాయి. వరలక్ష్మీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో చేసుకునేందుకు మహిళలు ఏర్పాట్లు పూర్తి చేసుకున్నారు. లక్ష్మీ కాసుల కోసం బంగారం షాపుల వద్ద కూడా మహిళలు పెద్ద సంఖ్యలో కనిపించారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

97వ వార్డు సప్తగిరినగర్‌లో ఉన్న అలివేలు మంగాదేవి ఆలయంలో శుక్రవారం నుంచి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ తెలిపింది. మూడు రోజుల ఈ ఉత్సవాలు జరగనున్నాయి. సాయంత్రం 6 గంటలకు విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, రుత్విక్ వరణం, రక్షాబంధనం, యాగశాలార్చన, అంకురార్పణ, హోమాలు నిర్వహించనున్నారు. 26న ఉదయం 8 గంటల నుంచి యాగశాలార్చన, పారాయణం, కుంభవాహనం, హోమాలు, అభిషేకం, ఉదయం 11 గంటలకు కల్యాణ మహోత్సవం, సాయంత్రం 6.30గంటలకు తిరువీధి నిర్వహిస్తారు. 27న ఉదయం 6 గంటల నుంచి ఆరాధన, సాయంత్రం 6 గంటల నుంచి పూర్ణాహుతి కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. వచ్చే నెల 17న అన్న సమారాధన నిర్వహించనున్నారు.

నేడు సింహగిరిపై లక్ష కుంకుమార్చన


సింహగిరిపై వేంజేసిన సువర్ణ అమ్మవారు, చదుర్భుజ తాయారు అమ్మవారు

సింహగిరిపై శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం 7 నుంచి 9గంటల వరకు సింహవల్లీ తాయారు అమ్మవారి సన్నిధిలో లక్ష కుంకుమార్చన నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సాయంత్రం 5.30 గంటలకు అమ్మవారికి సహస్ర నామార్చన నిర్వహించనున్నారు. సింహవల్లీ తాయారు అమ్మవారి ప్రతినిధులైన చతుర్భుజ తాయారు, సువర్ణ అమ్మవారికి తిరువీధి జరపనున్నారు. కొండదిగువ వేంకటేశ్వరస్వామి ఆలయంలో లక్ష్మీదేవికి కుంకుమ పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

నేడు ఆలయాల్లో విశేష పూజలు


సప్తగిరినగర్‌లో అలివేలు మంగాదేవి

పెందుర్తిలోని పలు ఆలయాల్లో శ్రావణ శుక్రవారం పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సుజాతనగర్‌లోని సప్తగిరినగర్ కాలనీ ఉన్న అలివేలు మంగాదేవి ఆలయంలో ఉదయం 10 గంటలకు లక్ష్మీ సహస్ర నామార్చన, విష్ణు సహస్ర నామార్చన నిర్వహించనున్నారు. సుజాతనగర్‌లోని కనకదుర్గ అమ్మవారి ఆలయంలో లక్ష్మీదేవి సహస్రనామార్చన పూజ చేయనున్నారు. పెందుర్తి మండలం రాంపురంలో ఉన్న రమా సహిత సత్యనారాయణ స్వామి, సంతోషిమాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

తక్షణం సమస్యల పరిష్కారానికి వినతి


ఎంఈవో లక్ష్మణరావుకు వినతిపత్రం అందిస్తున్న సమగ్ర శిక్షా అభియాన్ అవుట్ సోర్సింగ్ సిబ్బంది

సబ్బవరం: సమగ్ర శిక్షా అభియాన్‌లో పని చేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, పార్ట్‌టైం ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సబ్బవరంలో మండల విద్యాశాఖాధికారి ఎస్.లక్ష్మణరావుకు గురువారం వినతిపత్రం అందజేశారు. స్థానిక విద్యా వనరుల కేంద్రంలో ఎంఈవోను కలిసి ఈ మేరకు విన్నవించుకున్నారు. తమను రెగ్యులర్ చేసి, తక్షణమే మినిమం టైం స్కేలు అమలు చేయాలన్నారు. జూలై నెల పెండింగ్ జీతాలను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు ఎం.మహేష్, ఆర్.రమణ, సింహాద్రి, ఎస్.భూలక్ష్మి, ఎస్.లావణ్య పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ సమావేశం రేపు

అగనంపూడి: పీఆర్‌టీయూ పరవాడ మండల కమిటీ సమావేశం శనివారం సాయంత్రం నాలుగు గంటలకు లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్టు అనకాపల్లి జిల్లా పీఆర్‌టీయూ ప్రధాన కార్యదర్శి సీహెచ్. పెద్దినాయుడు తెలిపారు. ఈ సమావేశంలో మండల స్థాయిలో ఉపాధ్యాయ సమస్యలపై చర్చించడంతో పాటు మండల కొత్త కమిటీ ఏర్పాటు చేయనున్నట్టు తెలియజేశారు.

సంక్షేమం, అభివృద్ధికి సీఎం జగన్ ప్రాధాన్యం

- ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్


నరవలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్


సింహాచలం : ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలిస్తున్నారని, గడిచిన నాలుగేళ్లల్లో 95 శాతానికి పైగా హామీలను నెరవేర్చారని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. జీవీఎంసీ 88వ వార్డు నరవలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్ వెళ్లి గడిచిన నాలుగేళ్లుగా అందిచిన సంక్షేమ పథకాలను వివరించారు. అర్హులై ఉండి ఎవరికైనా పథకం అందకపోతే వారందరికీ వచ్చేలా చేస్తామన్నారు. ఈ మేరకు సచివాలయ సిబ్బందికి పలు సూచనలు చేశారు. అలాగే స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నవరత్నాలతోపాటు అనేక పథకాలు అందుతున్నాయని ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. నాలుగేళ్లలో తాము చేసిన అభివృద్ధి, అందించిన సంక్షేమ పథకాల వల్లే నేడు ప్రతీ ఇంటికీ వెళ్లగలుగుతున్నామన్నారు. ప్రతీ గడపలోనూ బ్రహ్మరథం పడుతున్నారన్నారు. అవినీతికి తావులేకుండా, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. వాలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చామన్నారు. ఎంత మంది జట్టు కట్టినా, గుంపులుగా పోటీచేసినా వచ్చే ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ప్రజలు ఉంటారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో మళ్లీ గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో 88వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి గంధ్రెడ్డి మహాలక్ష్మినాయుడు, పార్టీ సీనియర్ నాయకులు దాడి నూకరాజు, మల్ల నూక అప్పారావు, స్వామినాయుడు, అధికారులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో సామాజిక భవనం


తీరంలో శిథిలావస్థకు చేరిన సామాజిక భవనం పెచ్చులూడిన పిల్లర్లు (ఇన్‌సెట్‌లో)

పరవాడ: ముత్యాలమ్మపాలెం తీరంలో మత్స్యకారుల సౌకర్యార్థం పదేళ్ల కిందట లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన సామాజిక భవనం శిథిలావస్థకు చేరుకుంది. వలలు, ఇంజిన్లు, తదితర సామగ్రిని భద్రపర్చుకోవడానికి తీరంలో నిర్మించిన ఈ భవనం పాడై మరమ్మతుల కోసం ఎదురు చూస్తోంది. ఉప్పు గాలికి తుప్పు పట్టి స్తంభాలు పెచ్చులుగా ఊడిపోయి ఇనుప చువ్వలు బయటకు దర్శనమిస్తున్నాయి. భవనానికి ఏర్పాటు చేసిన 8 పిల్లర్లు పెచ్చులూడిపోయాయి. భవనానికి మరమ్మతులు చేపట్టాలని అధికారులకు మొర పెట్టుకున్నా ఫలితం లేదని గంగపుత్రులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి భవనం మరమ్మతులకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

బస్ షెల్టర్ ఇలా.. నిరీక్షించేదెలా?


శిథిలావస్థకు చేరి కూలడానికి సిద్ధంగా ఉన్న బస్ షెల్టర్

పరవాడ: మండలంలో కలపాక గ్రామ ప్రజలు సౌకర్యార్థం మూడు రోడ్ల కూడలిలో ఏర్పాటు చేసిన బస్ షల్టరు భవనం శిథిలావస్దకు చేరి కూలడానికి సిద్ధంగా ఉంది. కలపాక, స్వయంభూవరం, మూల స్వయంభూవరం గ్రామాల ప్రజల సౌకర్యార్థం మూడు రోడ్ల కూడలిలో 10 ఏళ్ల క్రితం నిర్మించిన బస్ షెల్టర్ శిథిలావస్థకు చేరింది. ప్రస్తుతం బస్ షెల్టరులో గచ్చులు, శ్లాబు పూర్తిగా పాడయ్యాయి. ఏ మాత్రం వర్షం కురిసిన శ్లాబు కారిపోతుంది. గచ్చులు పగుళ్ల ఏర్పడ్డాయి. శిథిల దశలో ఉన్న బస్ షెల్టరు భవనం ఏ క్షణంలో కూలుతుందో తెలియని పరిస్థితి. గ్రామాల నుంచి వివిద ప్రాంతాలకు ప్రయాణాలు సాగిస్తున్న ప్రయాణికులకు నిలవ నీడ లేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణికులకు నిలువ నీడ లేక ఎండ వానల్లో కాలం వెళ్లదీస్తున్నారు. అధికారులు స్పందించి శిథిలావస్దకు చేరిన బస్ షెల్టరు తొలగించి ఆ ప్రదేశంలో నూతన బస్ షెల్టరు భవనం నిర్మించడానికి చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

కుటుంబ సభ్యుల చెంతకు వృద్ధుడు


వృద్ధుడు నాగరాజును అతని కోడలు లక్ష్మికి అప్పగిస్తున్న ప్రగడ వాసు

అల్లిపురం : ఈ నెల 19వ తేదీన ఆర్కే బీచ్‌లో పడి ఉన్న వృద్ధుడు నాగరాజుని టూరిజం కానిస్టేబుల్, మహారాణిపేట కానిస్టేబుళ్లు రక్షించారు. అతనికి భీమ్‌నగర్ ఏయూటీడీ నిరాశ్రయ వసతి గృహం మేనేజర్ జ్యోతిర్మయి ఆశ్రయం కల్పించారు. ఈనెల 21న సాక్షి పత్రికలో ‘వృద్ధుడికి ఆశ్రయం’ పేరిట ప్రచురితమైన కథనం చూసిన నాగరాజు కుటుంబ సభ్యులు గురువారం ఏయూటీడీ నిరాశ్రయ వసతి గృహానికి వచ్చి కార్యదర్శి ప్రగడ వాసును సంప్రదించారు. దీంతో సిబ్బంది వృద్ధుడిని అతని కోడలు లక్ష్మికి అప్పగించారు. ఈ సందర్భంగా వారు సాక్షికి, నిరాశ్రయ వసతి గృహ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

కన్వెన్షన్ సెంటర్ నిర్మాణ పనుల పరిశీలన


కన్వెన్షన్ సెంటర్ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ముమ్మన దేముడు

సింహాచలం : జీవీఎంసీ 95వ వార్డు పరిధి చీమలాపల్లిలో రూ.2 కోట్లతో నిర్మిస్తున్న కన్వెన్షన్ సెంటర్ పనులను కార్పొరేటర్ ముమ్మన దేముడు గురువారం పరిశీలించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్‌కి సూచించారు. రోజూ వాటరింగ్ చేయాలని, త్వరితగతిన పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బొడ్డు దేముడుబాబు, సోషల్ మీడియా కన్వీనర్ కె.సంతోష్ పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే ప్రమాదాల నియంత్రణ



మాట్లాడుతున్న డీటీసీ రాజారత్నం

కొమ్మాది: రహదారి భద్రతపై గీతం డీమ్డ్ విశ్వ విద్యాలయం స్కూల్ ఆఫ్ బిజినెస్ జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ అమిత్ భద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ (డీటీసీ) డాక్టర్ జీసీ రాజారత్నం మాట్లాడారు. రహదారులపై జరుగుతున్న ప్రమాదాల్లో ఏటా 1.5 లక్షల మంది ప్రాణాలు కోల్పోతుండగా, 4.5 లక్షల మంది తీవ్ర గాయాలపాలవుతున్నారన్నారు. రహదారి భద్రత కోసం ప్రభుత్వాలు ఏటా రూ.1.5 లక్షల కోట్లు వెచ్చిస్తున్నాయని.., రహదారి ప్రమాదాలు సామాజిక సమస్యగా మారాయని, ప్రతి ఒక్కరి సహకారంతోనే తగ్గించవచ్చన్నారు. జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవడానికి విద్యార్థులు కృషి చేయాలని, మితిమీరిన వేగంతో వాహనాలు నడిపి రహదారులపై ప్రాణాలు కోల్పోకుండా చూసుకోవాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షితంగా గమ్య స్థానాలకు చేరుకోవాలని సూచించారు.

విశేషంగా ఆర్జిత సేవలు


నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ పుష్పార్చన ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలో వేదికపై వేంజేపచేశారు. ఉభయదాతలను స్వర్ణ పుష్పాలతో ప్రదక్షిణ చేయించారు. స్వామి సన్నిధిలో విశ్వక్సేణ పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహిస్తూ 108 స్వర్ణపుష్పాలతో అర్చన చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

భక్తిశ్రద్ధలతో నిత్య కల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్య కల్యాణం విశేషంగా నిర్వహించారు. ఉదయం 9.30 గంటల నుంచి ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. విశ్వక్సేణ పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణ ధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదాన్ని, శేష వస్త్రాలను అందజేశారు.

అప్పన్న సన్నిధిలో ప్రముఖులు


అప్పన్న ఆలయంలో ఎమ్మెల్సీ కుంబా రవిబాబు తదితరులు


కప్ప స్తంభానికి మొక్కుకుంటున్న సత్యేంద్ర విక్రమ్ సింగ్


కప్ప స్తంభానికి మొక్కుకుంటున్న సీఈవో మణి

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. చీఫ్ కమిషనర్ ఆఫ్ సెంట్రల్ ట్యాక్స్ అండ్ కస్టమ్స్ సత్యేంద్ర విక్రమ్ సింగ్ స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు పూజలు నిర్వహించి, వేద ఆశీర్వచనం అందజేశారు. సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు.

వరాహ లక్ష్మీ నృసింహస్వామిని గురువారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో ఎ.మణి మేకలయ్ దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆమె పేరిట అర్చకులు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి, వేద ఆశీర్వచనం అందజేశారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వైజాగ్ జోన్ జనరల్ మేనేజర్ సీవీఎస్.భాస్కరరావు, సింహాచలం శాఖ మేనేజర్ రమేష్ ఆమె వెంట ఉన్నారు.

ఎమ్మెల్సీ రవిబాబు ప్రత్యేక పూజలు

వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఎమ్మెల్సీ కుంభా రవిబాబు దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం ఆయనకు స్వామివారి ప్రసాదం అధికారులు అందజేశారు. సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు మాజీ సభ్యుడు సూరిశెట్టి సూరిబాబు, తదితరులు ఆయన వెంట ఉన్నారు.

వ్యక్తి అరెస్టు : గంజాయి స్వాధీనం

కూర్మన్నపాలెం: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నాడనే ముందస్తు సమాచారంతో ఓ వ్యక్తిని దువ్వాడ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. ఈ కేసుకు సంబంధించి దువ్వాడ సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలివి.. అగనంపూడి దరి బొర్రమాంబ కాలనీకి చెందిన ముప్పల మహేశ్వరరావు అగనంపూడి, స్టీల్‌ప్లాంట్ తదితర ప్రాంతాల్లో పేకాట నిర్వహిస్తున్నాడని, అక్రమంగా గంజాయి విక్రయాలకు పాల్పడుతున్నాడని పోలీసులకు సమాచారం అందింది. దీంతో దువ్వాడ పోలీసులు బుధవారం రాత్రి మంగళపాలెం వద్ద నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించారు. ఆ సమయంలో అతని వద్ద ఉన్న 2 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు మహేశ్వరరావును అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు.

సిరిపురంలో ఆర్టీసీ పార్సిల్ కౌంటర్



పార్సిల్ కౌంటర్ వద్ద ఆర్టీసీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ అప్పలనాయుడు

బీచ్ రోడ్డు: ఆర్టీసీ లాజిస్టిక్ సేవలు అందుబాటు ధరల్లో లభ్యమవుతున్నట్లు సంస్థ డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ బి.అప్పలనాయుడు తెలిపారు. వాల్తేరు డిపో ఆధ్వర్యంలో సిరిపురంలోని 900కే బస్టాప్‌లో ఏర్పాటు చేసిన ఆర్టీసీ పార్సిల్ కౌంటర్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అప్పలనాయుడు మాట్లాడుతూ నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్, ఎంవీపీ, మద్దిలపాలెం కాంప్లెక్స్, తదితర ప్రాంతాల్లో పార్సిల్ కౌంటర్లు అందుబాటులో ఉన్నాయన్నారు. తక్కువ ఖర్చుతో పార్సిల్స్‌ను ఆర్టీసీ బస్సుల్లో గమ్యస్థానాలకు చేరవేస్తున్నట్టు చెప్పారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాల్తేరు డిపో మేనేజర్ సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులను క్రమబద్ధీకరించాలి

సీతమ్మధార: అనేక సంవత్సరాలుగా పని చేస్తున్న మున్సిపల్ కార్మికులను పర్మనెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనాలు చెల్లించాలని జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) అధ్యక్షుడు వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవీఎంసీ అధికారులతో జరిగిన ఒప్పందం ప్రకారం పబ్లిక్ హెల్త్‌లో డ్రైవర్లు, వెటర్నరీ, మలేరియా, యూజీడీ కార్మికులకు హెల్త్ అలవెన్స్, ఇంజినీరింగ్ కార్మికులకు సెమీస్కిల్డ్ వేతనాలు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్, మున్సిపల్ యూనియన్ నాయకులు కృష్ణారావు, అప్పలరాజు, రాజు, శ్రీదేవి పాల్గొన్నారు.